బీసీ బిల్లుపై చర్చించకపోవడం దారుణం

ఉస్మానియా యూనివర్సిటీ: నెల రోజుల పాటు జరిగిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో బిల్లును ఆమోదించి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై చర్చించకపోవడం దారుణమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. బీసీ బిల్లుపై పార్లమెంట్‌లో అధికార పక్షంతో పాటు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా ప్రస్తావించకపోవడం దారుణమన్నారు. అనేక ఆందోళనల ఫలితంగా అసెంబ్లీలో చర్చించి ఆమోదించినా.. కాంగ్రెస్ నేతలు పార్లమెంట్‌లో మౌనంగా ఉండటం దుర్మార్గమన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు మొండి చేయి చూపిన పాలక, ప్రతిపక్ష పార్టీలకు రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బూర శ్రీనివాస్‌గౌడ్, గోదా రవీందర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగంగా చేపట్టండి



బేగంపేట ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి

సనత్‌నగర్: అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి అధికారులను కోరారు. బేగంపేట ప్రకాష్‌నగర్ ఎక్స్‌టెన్షన్‌లో రూ.30 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా ఇక్కడి సీసీరోడ్డు నిర్మాణం పూర్తి చేయాలన్నారు. నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీపడొద్దన్నారు. అధికారులు కూడా అభివృద్ధి పనులు జరిగే ప్రాంతంలో నిరంతర పర్యవేక్షణ చేయడం ద్వారా కాంట్రాక్టర్లు నాణ్యత పాటించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో పాటు నాయకులు శ్రీహరి, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ శైలజ

బౌద్ధనగర్: చివరి శ్రావణ శుక్రవారం సందర్భంగా శుక్రవారం బౌద్ధనగర్ డివిజన్ దుర్గామాత ఆలయంలో స్థానిక కార్పొరేటర్ కంది శైలజ శ్రీకాంత్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుంకుమ అర్చనలో పాల్గొని అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి వాయనం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఆమెతో పాటు స్థానిక నేతలు ఉన్నారు.

కార్మికులకు సేఫ్టీ కిట్లు ఇవ్వండి



సీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని స్వీపింగ్ కార్మికులకు తగిన సౌకర్యాలు కల్పించాలని కాంగ్రెస్ సీనియర్ నేతలు, బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ బాబు, వైస్ చైర్మన్ దేవేందర్ డిమాండ్ చేశారు. కంటోన్మెంట్ బోర్డు సీఈఓను కలిసి వినతి పత్రం అందజేశారు. కంటోన్మెంట్ పరిధిలో రోడ్లు, వీధులను శుభ్రం చేసే స్వీపర్‌లకు బోర్డు తరఫున సేఫ్టీ కిట్స్ అందజేయాలన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో కనీసం రెయిన్‌కోట్‌లు లేక ఇబ్బందులు పడుతున్నారని సీఈఓ దృష్టికి తీసుకొచ్చారు. జీహెచ్‌ఎంసీలో మాదిరిగా స్వీపింగ్ సిబ్బందికి పూర్తిస్థాయిల్ కిట్‌లు అందజేయాలని కోరారు. దుర్భర పరిస్థితుల్లో పనిచేస్తూ మృత్యువాత పడిన సిబ్బంది కుటుంబ సభ్యుల్లో మరొకరికి ఉపాధి కల్పించాలని కోరారు. సీఈఓను కలసిన వారిలో మార్కెట్ కమిటీ సభ్యులు సంతోష్ జూలియస్, రాజేందర్ ఉన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు రూ.., కిలోల్లో.. టమాటా 37, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 40, క్యాప్సికం 43, పచ్చకాకర 23, పందిరి బీర 38, క్యాబేజీ 13, క్యారెట్ 45, దొండ 23, గుండు బీన్స్ 65, గింజ చిక్కుడు 40, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 13, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 23, చామగడ్డ 25, మొరంగడ్డ 40, కందగడ్డ 40, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 3–5. ఈ ధరలు శనివారం ఉదయం 9 వరకు అమలులో ఉంటాయి.



నివాస ప్రాంతాల సరిహద్దు గోడ వెంబడి మళ్లించిన ఓపెన్ నాలా



ఏఓసీ సమీపంలో వెలిసిన వివాస్పద నిర్మాణం

ఫస్ట్ అక్రమ నిర్మాణాలు.. ఆపై క్రమబద్ధీకరణ!



- నాలా మళ్లింపు హామీ మరిచిన వైనం
- అవస్థలు పడుతున్న సమీప బస్తీల వాసులు

కంటోన్మెంట్: ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్ (ఏఓసీ) భారత ఆర్మీ కీలక విభాగాల్లో ఒకటి. సికింద్రాబాద్‌లో వందలాది ఎకరాల్లో విస్తరించిన ఏఓసీ రెజిమెంట్‌కు భారత రక్షణ శాఖ నుంచి అన్ని రకాల సేవలు, సహకారం అందుతూనే ఉంది. ఆర్మీ క్యాంటీన్, అధునాతన ఆడిటోరియం, ఏకంగా ఓ క్రికెట్ స్టేడియం, సిబ్బంది క్వార్టర్స్, ఇతరత్రా సదుపాయాలన్నీ ప్రభుత్వ తరఫునే అందుతున్నాయి. అయినప్పటికీ రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులకు సేవలందించే పేరిట వెలిసిన ఏఓసీ రెజిమెంటల్ అసోసియేషన్ సమీపంలోని ఆరున్నర ప్రైవేట్ స్థలాన్ని చేజిక్కించుకొని భారీ అక్రమ నిర్మాణాలు చేపట్టింది. దీనిపై కంటోన్మెంట్ అధికారులు లేవనెత్తిన అభ్యంతరాలను సైతం లెక్క చేయకుండా నిర్మాణాలు పూర్తి చేశారు. పనిలో పనిగా ఈ స్థలంగా గుండా వెళ్లే వరద నీటి కాల్వను సైతం మళ్లించేశారు. దీంతో డ్రైనేజీ సమస్య తీవ్రం కావడంతో సమీప కాలనీలు, బస్తీవాసులు తీవ్ర ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ ఏఓసీ రెజిమెంటల్ ఆగడాలపై ఏకంగా బోర్డు సమావేశంలోనే ఆక్షేపణలు లేవనెత్తారు. ప్రైవేట్ స్థలంలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణ పరిశీలనకు బోర్డు సిబ్బందిని సైతం అనుమతించకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. మొత్తానికి స్పందించిన బోర్డు నాలా మళ్లింపునకు జరిమానా రూపంలో ఏఓసీ రెజిమెంటల్ అసోసియేషన్ ద్వారా నిధులు కేటాయిస్తామని పేర్కొంది. ఈ మేరకు తీర్మానం చేసి ఐదేళ్లు గడుస్తున్నా నాలా ఆధునీకరణ, వరదనీటి కాల్వ మళ్లింపు చర్యలు చేపట్టిన దాఖలాల్లేవు. దీనిపై బాధిత బస్తీలవాసులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. తాజాగా సదరు స్థలంలో మళ్లీ అక్రమ నిర్మాణాలు చేపట్టడం గమనార్హం.

ఏమిటీ వివాదం?

ఏఓసీ సెంటర్ సమీపంలో సుమారు ఆరున్నర ఎకరాల ప్రైవేట్ స్థలం ఉంది. ఈ స్థలాన్ని 1950లలోనే ఏఓసీ రెజిమెంటల్ అసోసియేషన్ కొనుగోలు చేసినట్లుగా సదరు అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా 2015లో ఈ స్థలంలో నిర్మించిన ఫంక్షన్ హాల్‌ను నిర్మించారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో బోర్డు అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో సదరు అసోసియేషన్ ప్రతినిధుల కొత్తగా భవన నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. అప్పటికే సగం నిర్మాణం పూర్తయిన భవనానికి కొత్తగా దరఖాస్తుల చేయడంపై అప్పట్లోనే బోర్డు సభ్యులు కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. మొత్తానికి అధికారులు తమ తప్పిదాన్ని సరిదిద్దుకునే క్రమంలో అక్రమ నిర్మాణం క్రమబద్ధీకరణకు తెరలేపారు. 2021, డిసెంబర్ 17న జరిగిన బోర్డు సమావేశంలో తీర్మానించిన మేరకు ఏఓసీ రెజిమెంటల్ అసోసియేషన్ నుంచి రెండింతల డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేయాలని నిర్ణయించారు. ఆ సొమ్ములు వసూలయ్యాయో లేదో తెలియదు కానీ, వివాస్పద స్థలంలో ఓపెన్ నాలాల పరిస్థితి మాత్రం మరింత దారుణంగా మారింది. ఈ స్థలం గుండా వెళ్లే మూడు వేర్వేరు నాలాల సహజ గమనాన్ని మార్చేయడంతో ఆర్మీ స్థలంతో పాటు సమీప బస్తీలు మునకకు గురువుతున్నాయి. ముఖ్యంగా గాంధీనగర్, దుర్గా గార్డెన్స్, గణేశ్ నగర్, హనుమంతరావు గార్డెన్‌లతో పాటు వెల్లింగ్టన్ ఎన్‌క్లేవ్ వాసులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా బోర్డు అధికారులు స్పందించి, తమను ముంపు సమస్య నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

డ్రైనేజీ సమస్యలు తీర్చండి



నేతాజీ నగర్‌లో పర్యటిస్తున్న బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ఒకటో వార్డు పరిధిలోని డ్రైనేజీ సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి (జేఎమ్మార్) డిమాండ్ చేశారు. శుక్రవారం బోర్డు శానిటరీ సిబ్బందితో కలసి నేతాజీనగర్‌లో పర్యటించి పలు సమస్యలను వారికి దృష్టికి తీసుకొచ్చారు. తాజా వర్షాలకు డ్రైనేజీ లైన్‌లు పూడుకుపోయి మురికి నీరు వీధుల్లోకి వస్తుందని తెలిపారు. సమస్యల తీవ్రత దృష్ట్యా తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. అవసరమైతే అదనపు నిధులు కేటాయించి అయినా పనులు చేపట్టాలన్నారు. ఈ మేరకు త్వరలోనే బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌ను కలసి సమస్యను వివరిస్తామన్నారు. ఈ పర్యటనలో మహేశ్వర్‌రెడ్డితో పాటు దఫేదార్ విజయ్ కుమార్, ఒకటో వార్డు బీఆర్‌ఎస్ అధ్యక్షులు నర్సింహారావు, అనిల్ కుమార్ యాదవ్, విజయ్ యాదవ్, శేఖర్, ప్రసాద్‌రెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నిలబెట్టుకోవాలి



మాట్లాడుతున్న ఎంఎస్పీ జాతీయ నాయకుడు నరేంద్రబాబు

బౌద్ధనగర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఎంఎస్పీ జాతీయ నాయకుడు సొట్ట నరేంద్రబాబు మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం బౌద్ధనగర్ డివిజన్ సంజీవపురం బస్తీలో దివ్యాంగులు, చేయూత పెన్షన్‌దారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన సొట్ట నరేంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే చేయూత పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పింఛన్లను పెంచకుండా మోసం చేశారన్నారు. అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా.. పింఛన్ల పెంపుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలు అమలు చేయకున్నా.. ప్రతిపక్ష పార్టీలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయన్నారు. దివ్యాంగుల పింఛన్ రూ. 6 వేలు, వృద్ధులు, వితంతు, ఒంటరి మహిళలతో పాటు చేయూత పింఛన్లన్నీ రూ.4 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 9న పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన చేయూత పింఛన్‌దారుల మహాగర్జనకు పెద్దఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డప్పు మల్లికార్జున్ మాదిగ, రుద్ర, తుమ్మల శివప్రసాద్, డప్పు మహేశ్, కొప్పుల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర నాయకుల హౌస్ అరెస్ట్



మాజీ మేయర్ కార్తీకరెడ్డి, బీజేపీ నేతలను హౌస్ అరెస్ట్ చేసిన ఓయూ పోలీసులు

లాలాపేట: జీహెచ్‌ఎంసీ అసమర్థ పాలనతో హైదరాబాద్ నగర ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని మాజీ మేయర్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు బండ కార్తీక చంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనను నిరసిస్తూ బీజేపీ తలపెట్టిన చలో సెక్రటేరియట్ కార్యక్రమం నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు కార్తీక చంద్రారెడ్డిని ముందస్తుగా ఇంటివద్ద అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తున్న వారిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. సీఎం రేవంత్‌రెడ్డి వద్ద ఉన్న మున్సిపల్ శాఖ నగర ప్రజల సమస్యలను పరిష్కరించడంలో తీవ్రంగా విఫలం చెందుతుందని అన్నారు. హైదరాబాద్ నగరంలో విచ్చలవిడిగా హై టెన్షన్ వైర్లు జనవాసాల మీద ఉండడం వల్ల ఇటీవల రామంతపూర్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. గొప్పగా చెప్పుకుంటున్న జీహెచ్‌ఎంసీ, హైడ్రా, ఆయా విభాగాల మధ్య సమన్వయం లేదని దీంతో హైదరాబాద్‌లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. వెంటనే దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. హౌస్ అరెస్ట్ అయిన వారిలో రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి, శివారెడ్డి, వీరన్న, కిరణ్‌గౌడ్, సంపత్, భూపాల్ రెడ్డి, చరణ్‌రాజ్, లడ్డు, కేదార్, రాజ్ కుమార్, చిన్ని కృష్ణ తదితరులు ఉన్నారు.



ప్రత్యేక అలంకరణలో మహంకాళి అమ్మవారు



ఆలయంలో భక్తుల సందడి

రాంగోపాల్‌పేట్: శ్రావణ మాసంలో వచ్చే చివరి శుక్రవారం కావడంతో సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయం భక్తులతో పోటెత్తింది. అమ్మవారి గర్భగుడిని వివిధ రకాల పండ్లతో ముస్తాబు చేశారు. మహంకాళి అమ్మవారికి శుక్రవారం చివరి సాక సమర్పించారు. బోనాల జాతర సందర్భంగా రంగంలోని భవిష్యవాణిలో తనకు ఐదు వారాల పాటు సాక పప్పులు, బెల్లం సమర్పించాలని అమ్మవారు చెప్పిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా అమ్మవారికి సాక సమర్పించారు.

కలెక్టర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆదం సంతోష్‌కుమార్

సికింద్రాబాద్: నియోజకవర్గంలో నెలకొన్న పెండింగ్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సికింద్రాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆదం సంతోష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ హరిచందన దాసరిని కలిసిన ఆయన వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు శిల్పాచారి, అమర్‌నాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆదివాసీ విద్యార్థి నేత అరెస్ట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఆదివాసీ విద్యార్థి రాష్ట్ర నేత సాగబోయిన పాపారావును ఓయూ పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం గో బ్యాక్ మార్వాడి గో బ్యాక్ నినాదంతో తలపెట్టిన బంద్ సందర్భంగా హబ్సిగూడ చౌరస్తా వద్ద గల మార్వాడిల బంగారు షాపు ఎదుట టైర్లు కాల్చి నిరసన వ్యక్తం చేశారు. బంద్‌కు పిలుపునిచ్చిన ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి, వేణుగోపాల్ అరెస్ట్‌ను ఖండించారు. వారిని వెంటనే విడుదల చేయాలని పాపారావు డిమాండ్ చేశారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



సిల్వర్ కాంపౌండ్ వద్ద పవర్‌బోర్‌వెల్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలో ప్రజల నీటి ఎద్దడి నివారణకు నిధులు కేటాయించి పవర్‌బోర్‌వెల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేశ్ తెలిపారు. శుక్రవారం రసూల్‌పురా సిల్వర్ కాంపౌండ్ డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయం వద్ద పవర్‌బోర్‌వెల్ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించేలా కృషి చేశానని చెప్పారు. అట్టి నిధులతో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. గత బీఆర్‌ఎస్ పాలనలో కంటోన్మెంట్‌లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నరేశ్, మల్లేశ్, యాదగిరి స్థానికులు పాల్గొన్నారు.

పిల్లలకు వాహనాలిస్తే.. రిజిస్ట్రేషన్ రద్దు

రసూల్‌పురా: పద్దెనిమిదేళ్ల లోపు పిల్లలకు వాహనాలు డ్రైవ్ చేయమని ప్రోత్సహించే తల్లిదండ్రులపై చర్యలు ఉంటాయని, వాహన రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని డీసీపీ రాహుల్ హెగ్డే పేర్కొన్నారు. కార్ఖానాలో ట్రాఫిక్ ఏసీపీ పోలీస్ స్టేషన్, కార్యాలయాన్ని అదనపు డీసీపీ వేణుగోపాల్, ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజుతో కలసి రాహుల్‌హెగ్డే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జంక్షన్లల్లో రాంగ్‌సైడ్ డ్రైవింగ్, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వల్ల వాహనదారులు జైలుశిక్షకు గురి అవుతారని అన్నారు. ఇక వర్షకాలంలో వాహనదారులు సురక్షితంగా డ్రైవింగ్ చేయడానికి ప్రత్యేక బృందాలు వర్షపునీటిని యంత్రాలతో తొలగిస్తారని చెప్పారు. గణేశ్ పండుగను పురస్కరించుకొని విద్యుత్, జీహెచ్‌ఎంసీ, కంటోన్మెంట్ అధికారులతో సమన్వయం చేసుకొని ప్రశాంతంగా నిమజ్జనం జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. డీజేలకు అనుమతి లేదని మండప నిర్వాహకులు గమనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు నాణ్యత సేవలు అందించేందుకు నూతనంగా అవెంజర్ బైక్‌ను ఆవిష్కరించారు. ట్రాఫిక్ సీఐ మధుబాబు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సంతోషిమాత ఆలయంలో పూజలు



దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ జీరాలోని సుప్రసిద్ధమైన సంతోషిమాత దేవాలయంలో శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో కుంకుమార్చన, అభిషేకం, ఇతరత్రా పూజలును అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తుల రాకతో దేవాలయ ప్రాంగణం ఆధ్యాత్మికశోభను సంతరించుకుంది. శుక్రవారం దేవాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, టీపీసీసీ కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ, టి.మనోజ్‌కుమార్, బీఆర్‌ఎస్ నాయకులు తలసాని సాయియాదవ్, అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్, జయసింహ, లక్ష్మీపతి, ప్రేమ్, కుమార్ యాదవ్, బీజేపీ నాయకులు వినయ్, వై. సురేష్‌కుమార్, ఆలయ కమిటీ ప్రతినిధులు మనోజ్, గణేశ్, ప్రేమ్, అరుణ్‌గౌడ్, అంజన్, క్రిష్ణరాజు, అనుపమ, సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు.

యాజమాన్య కమిటీలను కొనసాగించాలి



సమావేశంలో పాల్గొన్న తల్లుల సంఘం, సీఆర్పీఎఫ్ ప్రతినిధులు

అడ్డగుట్ట: పాఠశాల యాజమాన్య కమిటీలను యథావిధిగా కొనసాగించాలని తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం అడ్డగుట్టలో తల్లుల సంఘం, సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ బాలలకు ఉచిత నిర్బంధ విద్య హక్కు చట్టం 2009లోని సెక్షన్ 21, 22 ద్వారా తల్లిదండ్రులకు పాఠశాల నిర్వహణలో భాగస్వామ్యం కల్పించేందుకు ప్రతీ పాఠశాలలో యాజమాన్య కమిటీలను ఏర్పాటు చేసుకోవడానికి చట్ట రూపం ఇచ్చామన్నారు. తద్వారా తల్లిదండ్రులు నిరంతరం ఉపాధ్యాయులు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ అధికారులతో సంప్రదింపులు జరుపుతూ పాఠశాలలో మెరుగైన వసతుల కల్పనకు తమవంతు కృషి చేస్తారని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం చట్టబద్ధ పాఠశాల యాజమాన్య కమిటీ స్థానంలో పొదుపు ఐక్య సంఘాల అధ్యక్షులను ‘అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ’లకు అధ్యక్షులుగా నియమించి విద్యార్థుల తల్లులను సభ్యులుగా చేస్తున్నారన్నారు. తద్వారా నిర్ణయాలలో తల్లిదండ్రుల పాత్ర నిర్వీర్యమవుతుందన్నారు. అంతే కాకుండా ఇది రాజ్యాంగం తల్లిదండ్రులకు కల్పించిన హక్కును నిరాకరించడం అవుతుందని పేర్కొన్నారు. అందువల్ల చట్టం స్ఫూర్తికి వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన ‘అమ్మ ఆదర్శ కమిటీ’ల నిర్ణయాన్ని వెనక్కు తీసుకొని, ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం ప్రకారం పాఠశాల యాజమాన్య కమిటీలకు ఎన్నికలు జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు అజయ్ బాబు, సీహెచ్. లక్ష్మీనారాయణ, రమాదేవి, ఎస్. శోభ, ప్రవీణ్‌కుమార్, సువర్ణ, లత, సుమలత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవ సమితి బౌద్ధనగర్ డివిజన్ కన్వీనర్‌గా లడ్డు



నియామకపత్రాన్ని అందుకుంటున్న లడ్డు

బౌద్ధనగర్: భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి బౌద్ధనగర్ డివిజన్ కన్వీనర్‌గా యువ నాయకుడు లడ్డు నియామితులయ్యారు. శుక్రవారం గణేశ్ ఉత్సవ కమిటీ కార్యాలయం బెహతి భవన్‌లో జరిగిన సికింద్రాబాద్ అసెంబ్లీ ముఖ్య నాయకుల సమావేశంలో ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి రావినూతల శశిధర్ చేతుల మీదుగా నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మన సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందజేసేలా పనిచేసి హిందుత్వ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటానని తెలియజేశారు. తనకు బాధ్యత రావడానికి సహకరించిన భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కార్యదర్శి అలె భాస్కర్, ఉత్సవ కమిటీ సికింద్రాబాద్ పార్లమెంట్ కో–కన్వీనర్ భాస్కర్ గిరి, బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ఉపాధ్యక్షుడు రాచమళ్ల కృష్ణమూర్తి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సురేశ్, అల్లాడి గంగా యాదవ్, శ్రవణ్ ముదిరాజ్, సందీప్ కప్పేరా, మనోహర్, రమేశ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పెన్షన్‌లు పెంచాలి



కంటోన్మెంట్: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్‌లకు పెంచాలని ఎంఎస్పీ జాతీయ నాయకుడు సొట్టనరేంద్రబాబు డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇటుక కిషన్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ నియోజకవర్గం ఆరోవార్డు వెస్ట్‌మారేడుపల్లి, ఐదో వార్డు మారేడుపల్లిలో నిర్వహించిన సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు తగిన పెన్షన్‌ల కోసం ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9న పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే దివ్యాంగుల మహాగర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అన్ని బస్తీలు, కాలనీల్లో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు కలసి సమావేశానికి రావాలని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మంద మధుకర్, విష్ణు, బేగరి నర్సింహ, నరేశ్, అనిల్, రమేశ్, రాజేశ్, రేఖ, సరిత, గంగ తదితరులు పాల్గొన్నారు.